

“వ్వేర్ దేర్స్ ఏ విల్ - దెర్స్ ఏ వె.”

“వాడ్డు యు మీన్?” మూర్తి రాజు మాటల్లోని వ్యంగ్యాన్ని గుర్తించి చురుగ్గా చూశాడు గిరిబాబు.

“ఐ మీన్...” అని క్షణ మాగి, గిరిబాబు కళ్ళలోకి సూటిగా చూస్తూ- “నథింగ్” అని, కొస కంటా కాలిన సిగరెట్ బిట్‌ని యాష్‌ట్రేలో కుక్కి, “యు ఆర్




నా పై లిటిల్ బోయ్" అంటూ లేచి నిలబడ్డాడు మూర్తిరాజు.

"అఫ్‌కోర్స్...." ఇంకా ఏదో అనబోయి, ఆ అనేదేదో ఆటం బాంబు పేల్చినంత తీవ్రంగా అనా లనుకొని, సరియైన పదజాలంకోసం వెతుక్కుంటూ, నుదురు చిట్లించి కళ్ళు మూసుకున్నాడు గిరిబాబు.

కొద్ది క్షణాల తర్వాత గిరిబాబు కళ్ళు తెరుచుకున్నాయ్. పెదవులు

కూడా తెరుచుకోవడానికి సిద్ధపడ్డాయ్.

కానీ....వాటికా శ్రమ అక్కర్లేక పోయింది.

తెరుచుకున్న గిరిబాబు కళ్ళకి గేటుదాటి వెళ్ళిపోతున్న మూర్తి రాజు కనిపించాడు.

"మూర్తీ!" గొంతుదాకా వచ్చిన పిలుపుని దిగమింగుకొని, దీర్ఘంగా నిట్టూర్చి, కుర్చీలో వెనక్కి చేరగిలబడ్డాడు గిరిబాబు.

దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోజూస్తున్న అమాత్య శేఖరుణ్ని అవినీతి ఆరోపణలు చుట్టుముట్టి చీకాకు పరచినట్టు-అంతూ దరీ లేని ఆలోచన్లు అతన్ని చుట్టుముట్టి చీకాకు పరచసాగాయి.

* * *

మూర్తిరాజు మాటల్లో నిజం లేకపోలేదు.

అవును- 'మనసుంటే మార్గం' వుంటుంది. అట్టే మాట్లాడితే ఒక్క మార్గం కాదు, ఎన్నెన్నో మార్గాలుంటాయి.

నిన్న సాయంత్రం అన్నాడు తను మూర్తి రాజుతో-" రాధన్నెనెంత గాఢంగా ప్రేమించానో నీకు తెలీదు మూర్తీ! తనులేని నా జీవితాన్ని కలలో కూడా ఊహించలేనంతగా ఆమెను ప్రేమించాను. కానీ పరిస్థితులు, బాధ్యతలు నన్నామెకు దూరం కమ్మంటున్నాయ్. బాధ్యతలను తప్పించుకోవడం-చేతగానితన మనిపించుకుంటుంది. ఐ యామ్ సారీ మూర్తీ! నేను చేతగాని వాణ్ననిపించుకో లేను" అని.

ఏ కళనున్నాడో ఏమోగాని, అప్పుడేమీ అన్లేదు మూర్తిరాజు.

కానీ - ఈ రోజు తగులుకున్నాడు. తరిమి తరిమి కొట్టినట్టు గుక్క తిప్పుకోకుండా దుయ్యబట్టాడు. "రాధను నువ్వు నిజంగా ప్రేమించుండుంటే- 'పరిస్థితులు, బాధ్యతలు' అంటూ కుంటి సాకులు చెప్పి ఆమెను దూరం చేసుకోవటానికి సిద్ధపడవ్. నువ్వు ప్రేమించింది రాధని కాదు, ఆమె తాలూకు డబ్బుని. ఈ నిజాన్ని నేరుగా అంగీకరించే ధైర్యంలేక; ఇలా పొసిగీ పొసగని కబుర్లు చెబుతున్నావ్" అంటూ కళ్ళవెంబడి నిప్పులు కురిపించాడు.

నిజం! చేదుగా వున్నా నిజం నిజమే!

తను ప్రేమించింది నిజంగా రాధని కాదు__ఆమె తాలూకు డబ్బునే!

అవును!

లేకపోతే__కొన్నాళ్ళ క్రితం

దాకా రాధని చూడకుండా ఒక్క రోజైనా గడపలే ననుకునేవాడు తను. అట్లాంటిది....ఇప్పుడు.... రాధ లేకుండా....జీవితాంతం గడప టానికి సిద్ధపడుతున్నాడు!

అంటే .. అంతేగా మరి? రాధని తను ప్రేమించనట్టేగా మరి!

రాధ తనని గురించి ఇప్పుడే మనుకుంటుందో?

ఏమనుకుంటుంది? అసహ్యించు కుంటుంది.

నో—అలా వీల్లేదు. రాధ తన నసహ్యించుకో కూడదు.

తన సమక్షంలో వున్నప్పు డల్లా అందమైన రాధ కళ్ళల్లో అనూహ్యమైన అనురాగం సుస్ప ష్టంగా మెరిసేది. ఆ అనురాగం అంతరించిపోయినా ఫర్వాలేదు. కానీ....ఆ స్థానే ఏహ్యతను తనూహించలేడు. అవును— ఊహించలేడు.

కానీ....కానీ ...

సందిగ్ధావస్థలో పడ్డ గిరి బాబులో ఏ ఒక్క ఆలోచన కూడా సరియైన రూపును సంత రించుకోలేక పోయింది.

* * *

"గిరీ!"

నడుస్తున్నా వాడల్లా ఠక్కున నిల్చిపోయి, వెనుదిరిగి చూశాడు గిరిబాబు ఆశ్చర్యంతో.

రాధ.

"నువ్వా! బాగున్నావా?" పలక రింపుగా నవ్వబోయి, నవ్వే విష యంలో మాత్రం ఓడిపోయాడు.

"నేనే! బాగానే వున్నాను— నీ దయవల్ల." రెండగల్లో గిరి బాబు ప్రక్కకు జేరి, మూడో అడుగు ముందుకేస్తూ అడిగింది రాధ—"నీతో కొంచెం మాట్లా డాలి. వీలవుతుందా?"

ఊఁ, ఊహూఁలకు మధ్యస్థంగా తలూపాడు గిరిబాబు.

"అలా పార్క్‌దాకా వెళదాం."

"ఊఁ...."

అది అంగీకారమో, లేక మూలుగో అర్థంకాలేదు రాధకి.

అయినా, పార్క్‌కు దారి తీసింది. అతనామెను వెన్నంటి వెళ్ళాడు.

పార్క్‌లో ఓ మూలగా సిమెంట్ బెంచీమీద కూర్చున్నా రిద్దరూ.

"గిరీ!"—కుడిచేతి బొటన వ్రేలి నెయిల్ పాలిష్‌ని క్రింది పళ్ళ వరసతో గీస్తూ పిలిచింది రాధ.

ఆ పిలుపు గిరిబాబు చెవిని సోక్కకాదు; కావాలనే అత నెటో చూస్తూ మౌనంగా వుండిపోయాడు.

అతని నిర్లక్ష్యానికి రాధ మనసు

బాధపడింది. కళ్ళు చెమ్మగిల్లాయ్. దుఃఖంతో పూడుకుపోతున్న కంఠాన్ని ప్రయత్నపూర్వకంగా పెగల్చింది రాధ-"గిరీ! నా పిలుపు కోయిలా రావంలా కర్ణపేయంగా వుంటుందనే వాడివే! ఇప్పుడు— పిలుస్తుంటే విననట్టే ఎటో చూస్తున్నావు. ఏం? ఇప్పుడు నా పిలుపు సింహగర్జనలా భయంకరంగా గాని మారిపోయిందా?"

కణకణ లాడేలా కాల్చిన కత్తిని గుండెల్లో దించినట్టనిపించింది— రాధ అంత సూటిగా దెప్పి పొడిచేసరికి గిరిబాబుకి.

"సారీ రాధా! ఏదో ధ్యాసలో వున్నాను" అన్నాడు బాధనీ, కలవరపాటునూ కప్పి పుచ్చుకోవడానికి వ్యర్థప్రయత్నం చేస్తూ.

"అవున్లే. ఒకప్పుడు నా సమక్షంలో వుంటే నన్నూ నిన్నూ తప్ప, యావత్ప్రపంచాన్ని మరచి పోతా ననే వాడివి. ఇప్పుడు— ఎదురుగా వున్న నన్నే మరచి వేరే ధ్యాసలో వద్దావు. కారణం—నే నప్పట్లా దబ్బున్న రాధను కాక పోవడమేగా?"

రెక్కలుంటే తుర్రున అక్కణ్ణుంచి ఎగిరి పోవాలనిపించింది గిరిబాబుకి. పల్లేరుకాయల్తో చేసిన పరుపైపై పొర్లిస్తున్నట్లు—ఎందుకు రాధింత సూటిగా....?

'రాధా! నన్ను చిత్రహింస చేయ' కనుకున్నాడు గిరిబాబు మనసులో. పైకి మాత్రం— ఏమనాలో పాలుపోక, "నన్ను క్షమించు" అన్నాడు.

"క్షమించడమా! ఎందుకూ?" చాలా అమాయకంగా అడిగినట్టడిగింది రాధ.

ఆ అమాయకత తన గుండెల్ని చీల్చేందుకై కోరి తెచ్చిపెట్టుకున్న నటనని గిరిబాబు కర్థమైంది.

ఆ సమయంలో తను గనుక ధైర్యాన్ని కోల్పోతే చిత్తుగా ఓడిపోవడం ఖాయమన్పించి, నిండుగా ఊపిరి పీల్చి, నిబ్బరాన్ని గుండెల్లో నింపుకొని అన్నాడు గిరిబాబు— "ఎందుకా? నే న్నీకు ద్రోహం చేసినందుకు!"

"ద్రోహం?!" అమాయకతకు ఆశ్చర్యాన్ని జోడించి అడిగింది రాధ.

"అవును" అని చటుక్కున లేచి, "వస్తా" నంటూ వడివడిగా ముందుక్కదిలాడు గిరిబాబు.

"గిరీ! ఆగు." పిల్చింది రాధ.

ఆగలేదు గిరిబాబు.

సాగదీసి వదిలిన రబ్బరు ముక్కలా సాగిపోతున్న గిరిబాబుని ఒక్క పరుగున జేరి, "గిరీ! ఈ

లెటర్ చదువ్" అంటూ వేనిటీ బాగ్ లోంచి ఓ కాయితం తీసి, అతని చేతిలో వుంచి, సమాధానం కోసంగాని మరి దేనికోసంగాని వెయిట్ చేయకుండా, గిరుక్కున వెనుదిరిగి చరచరా వెళ్ళిపోయింది రాధ.

వెళ్ళిపోతున్న రాధవేపు ఆయోమయంగా చూస్తూ, ఒకింతసేపు చేష్టలుడిగి విల్చుండిపోయిన గిరిబాబు — కాస్సేపటికి తెప్పరిల్లి, చేతిలోని కాయితంలోకి దృష్టి మళ్ళించాడు.

"గిరీ!

మా నాన్నగారు వ్యాపారంలో పూర్తిగా దివాలా తీసి, మా కుటుంబం కటిక దారిద్ర్యానికి అంకితమై పోయిందని తెలిసినప్పట్నుంచీ, నీ దర్శన భాగ్యం పూర్తిగా కరువై పోయింది.

మూర్తిగారు నీ కెంత స్నేహితులో మా కుటుంబానికీ అంతే సన్నిహితులు కావడం చేత-సిగ్గు విడిచి, నేనాయన్తో పలుమార్లు నీకు కబురుపెట్టాను.

నువ్వన్నావటాయన్తో- 'నేను రాధను మనస్ఫూర్తిగానే ప్రేమించాను గాని, నా పెళ్ళితో ముడిపడి నా చెల్లెలి పెళ్ళి వుంది. ప్రస్తుత పరిస్థితుల్లో నేను రాధను చేసుకుంటే కట్నం రూపంలో పైసా కూడా రాదు. కట్నం లేకుండా నా దారిన్నేను పెళ్ళి చేసుకుంటే మా చెల్లెలు ఆజన్మాంతం బ్రహ్మచారిణిగా వుండిపోవాల్సి వస్తుంది. అంచేత నేను నా ప్రేమను త్యాగం చేస్తున్నా'నని.

శభాష్ గిరీ! నీ త్యాగం వెలగట్ట లేనిది!

గిరీ! నీ త్యాగాన్ని వేనోళ్ళ కొనియాడ్డానికి నాకు వేయి నోళ్ళైతే లేవు గాని, ఉన్న ఒక్క నోటితో ఓ చక్కటి నిజం చెప్పబోతున్నాను. ఈ నిజం-నీలోని త్యాగమూర్తిపై పెట్రోలు పోసి తగలబెట్టినా సరే, నేను మాత్రం నీ కిక దక్కను. అది గ్రహించి, నేను చెప్పే నిజాన్నాలకించేందుకు సిద్ధపడు.

సరిగ్గా మొన్నటి దసరా నాడు- మా ఇంట్లో నీ ప్రస్తావన వచ్చింది.

'నువ్వు శేషగిరితో తిరుగుతున్నావని తెలిసింది. నిజమేనా?' అని అడిగారు మా నాన్న. ఏనాటికైనా బయట పడాల్సిన నిజమే కదా అని, మన ప్రేమ సంగతి విప్పంకోచంగా నాన్నగారితో చెప్పేశాను నిన్ను తప్ప వేరెవర్నీ చేసుకోనని కుండ బద్దలు గొట్టినట్టు చెప్పాను.

అందుకు మా నాన్నగారే

మన్నారో తెలుసా? 'ఒక్కగా నొక్క బిడ్డవు. చిన్నప్పట్నుంచీ విన్నెంత అల్లారు ముద్దుగా పెంచిందీ నీకు తెలియంది కాదు. నా పెంపకంలో ఇంతవరకూ నువ్వు కోరిన ప్రతిదీ నీకు లభ్యమవుతూనే వచ్చింది. కానీ ఈ విషయంలో మాత్రం నీ ఇష్టాన్ని వెంటనే అంగీకరించేందుకు నేను సిద్ధంగా లేను. ఎందుకంటావా? నీ భావి జీవితం యావత్తూ ఇప్పటి నీ నిర్ణయంపైనే ఆధారపడివుంటుంది. శేషగిర్ని గురించి నేను వాకబు చేశాను. మనిషి గుణవంతుడేననీ, దురలవాట్లేమీ లేవనీ తెలిసింది. అయితే, తెలుసుకోవాల్సింది మరొకటి మిగిలిపోయింది. అతను ప్రేమిస్తుంది విన్నా? లేక విన్నంటి పెట్టుకుని వున్న లక్షల ఆస్తినా? ఇది తెలుసుకోవడానికి నేనో నాటకం ఆడబోతున్నాను. దాని ఫలితం గనుక నీ కనుకూలంగా వుంటే నాకేం అభ్యంతరం లేదు' అన్నారు నాన్న.

'సరే' అన్నాన్నేను.

అంతే! నాన్నగారు వెంటనే వ్యాపారంలో దివాలా తీసేశారు. నీ అసలు రంగు బయట పడిపోయింది.

గిరీ! షుగర్ కోటెడ్ పిల్ లాంటి నీ ప్రేమను మ్రింగటానికి నేను సిద్ధంగా లేను—ఇప్పుడు నువ్వు నీ మనసు మార్చుకున్నా.

ఇంతకీ- మా నాన్నగారు వ్యాపారంలో దివాలా తీయడం అనేది- వారి నాటకంలోని ఓ ముఖ్యాంశం మాత్రమేనని గ్రహించావా-లేదా?

నువ్వు నాకు ముఖం చాటు చేసుకు తిరుగుతున్నందు వల్ల, నేరుగా నీతో ఈ వివరాలన్నీ చెప్పే అవకాశం రాదని భావిస్తూ ఈ ఉత్తరం రాస్తున్నాను. దీన్ని నీ కెలా అందజెయ్యాలో ఇంకా నిర్ణయించుకో లేదు.

శెలవు.

నీ నుండి దూరమైపోతున్నందుకు మనస్ఫూర్తిగా సంతోషిస్తూ,

—రాధ."

చదవడం ముగించిన గిరిబాబు- గుండెల్లో పుండు పుట్టినట్టు గిజగిజలాడిపోయాడు.

కడుపులో చిచ్చుబుడ్డి వెలిగించినట్టు- అతన్లో విపరీతమైన బాధ!

* * *

ఏమంటా వన్నట్టు చూశాడు గిరిబాబు.

"ఇంపాజిబుల్!"

"అవును" తల దించుకుని అన్నాడు గిరిబాబు-"రాధ మనసు

మారడం అసాధ్యమే. కానీ-ప్రయత్నిస్తే అసాధ్యాలే సాధ్యాలవుతాయ్. మూర్తీ! ప్లీజ్-ఎలాగైనా సరే నువ్వు రాధను కన్విన్స్ చేయాలి. నేను పశ్చాత్తాప పడుతున్నట్టు తనతో చెప్పి, తన మనసు మార్చాలి."

"బాగుంది." గిరిబాబు వేపదోలా చూస్తూ అన్నాడు మూర్తిరాజు— "నేను చెప్పినంత మాత్రాన మనసు మార్చేసుకోవడానికి రాధేమైనా పసిపిల్లనుకుంటున్నావా?"

"........"

మెడను నగానికి తెగనరికినట్టు తలని భూమిలోకి వేళ్ళాడేసుకూర్చున్న గిరిబాబును చూస్తూంటే మూర్తిరాజుకి జాలేసింది. "ఇట్సాల్ రైట్! ఐ విల్ ట్రై మై లెవెల్ బెస్ట్" అన్నాడు.

"థాంక్యూ- థాంక్యూ వెరీ మచ్!" కృతజ్ఞతను సూచిస్తూ మూర్తిరాజు చేతులు పుచ్చుకున్నాడు గిరిబాబు.

"థాంక్స్ ఇప్పుడు కాదు- నీ అదృష్టం బాగుండి రాధ 'ఓ.కె.' అంటే అప్పుడు చెబుదువ్ గాని" అంటూ, సంభాషణను మరి పొడిగించకుండా- అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు మూర్తిరాజు.

* * *

వారం రోజుల తర్వాత—

"అదృష్టవంతుడివోయ్ గిరీ! రాధ ఒప్పుకుంది" అని మూర్తిరాజన్నపుడు పట్టరాని సంతోషంతో ఎగిరి గంతేసిన గిరిబాబు, ఆ పైన మరో వారం రోజుల తర్వాత- రిజిష్ట్రార్ సమక్షంలో రాధను తన దాన్ని చేసుకుని, ఆ మీదట రాధ చెప్పిన అసలుసిసలు చక్కటి నిజాన్నాలకించి కళ్ళు తేలేశాడు!

ఆ నాడు రాధ రాసిన ఉత్తరం మూర్తిరాజు ఆడించిన నాటకంలోని ఓ భాగం మాత్రమే!

"ఇంత జరిగాక మా నాన్నగారు మన పెళ్ళికొప్పుకోరు. కాబట్టి ముందుగా మనం రిజిస్టర్ మారేజ్ చేసేసుకుని, ఆ తర్వాత వారికి తెలియజేద్దాం" అని రాధ అన్న మాటలు కూడా మూర్తిరాజు నేర్పించిన చిలుక పలుకులే!

'ఔరా ఎంత మోసం!' అనుకున్నాడు గిరిబాబు మనసులో.

అలా అనుకుంటూ చేష్టలు దక్కి నిలబడిపోయిన అతని వేపు కొంటెగా చూస్తూ అన్నది రాధ— "ఎలాకొట్టానెదెబ్బ!"

'భలే కొట్టావ్ దెబ్బ!' అనాలనుకున్నాడు గిరిబాబు. కానీ అతని నోరు పెగల్లేదు. *